మినీకథ

# అమ్మకావాలి

కవితాప్రియ



"మీకు ఎంతగా చెప్పినా విన్నారు కాదు- బొద్దుగా ముద్దుగా ఉందని".

"పదే పదే నాకా విషయం రెట్టించకు. నీ కోరిక ప్రకారం తీసుకు వచ్చాను".

"ఇది మరీ బావుంది ఏదో నాకోరిక చెప్పాను ముచ్చట తీర్చే విధానం ఇదా!"

"జరిగిన దాని గురించి విచారించడం కాదు జరగవలసిన దాని గురించి ఆలోచించు ముందా పాపకి ఏమైన పెట్టు ఆకలికి ఏడుస్తుందేమో".

పాలు ఇప్పుడే పట్టానులెండి, ఏదన్నా పెడితే తినేస్తుంది వెంటనే 'అమ్మకావాలి' అని ఏడుస్తుంది.

"క్రొత్త కదా నెమ్మదిగా అలవాటయితే నిన్ను వదిలి పెట్టదులే, కన్నతల్లికన్నా పెంచిన తల్లి ప్రేమనే కోరుకుంటారు పసివాళ్ళు, కాస్త ఓపికగా ఆ పాపకి దగ్గరయేందుకు ప్రయత్నించు"

"నెలల పాపయితే తల్లి గుర్తు తెలియదు- ఎవరి దగ్గరవుంటే వారే అమ్మ అని అలవాటు పడిపోతారు నాలుగేళ్ళ పాపని మరిపించి మురిపించగలమా!"

రాధిక భర్తతో వాదించడం ఇష్టంలేని దానిలా లేచి పాపని ఎత్తుకుని తన గదిలోకి తీసుకెళ్ళింది.

పాప ఏడుపు వినిపిస్తూనే వుంది- రాధిక సముదాయింపు మాటలు అంతకు రెట్టింపు వినిపిస్తూనే వున్నాయి.

తనలో తనే నవ్వుకున్నాడు రాజారావు.

పెళ్ళయి ఆరేళ్ళవుతున్నా సంతానం కలుగని కారణంగా రాధిక సతాయింపు మూలంగా ఎవరినైనా పెంచుకోవాలని అనుకున్నారు.

ఇంతలో ఆఫీస్ పనిమీద హైదరాబాద్ వెళ్ళవలసి రావడంతో "వచ్చేటప్పుడు అలా పిల్లల గురించి ఆరాకి సేకరిస్తాను" అని చెప్పి బయలు దేరాడు. ఆఫీసు వర్క్ పూర్తి అయిన తరువాత తిరుగు ప్రయాణంలో రైల్వేస్టేషన్ కి వచ్చాడు.

ఎవరి హడావిడిలో వారు అటూఇటూ తిరుగుతూ ట్రైన్ పై ఎగబడుతున్నారు. నాలుగేళ్ళ పాప ఏడుపు ఎవరూ పట్టించుకోవడం లేదు.

ట్రైన్ ఎక్కబోతున్న రాజారావు ఆ దృశ్యం చూసి చటుక్కున క్రిందికి ఉరికేసాడు.

"ఎవరు కావాలి పాపా ఎందుకేడుస్తున్నావు" లాలనగా అడిగాడు.

"అమ్మా......" మళ్ళీ ఏడుపు లంకించుకుంది.

"ఎక్కడుంది మీ అమ్మ" చుట్టూ చూస్తూ అడిగాడు.

అప్పుడే కదిలి వేగం పుంజుకున్న ట్రైన్ వైపు చూపించి ఏడుస్తోంది.

చుట్టు చూసాడు ఎవరిపనుల హడావిడిలో వారు న్నారు. ఎవరూ పట్టించుకోవడంలేదు. ఒకరిద్దరు ఇటు చూసినా మళ్ళీ మామూలుగా ఏదో ట్రైన్ రావడంతో అటునరుగులు పెడుతున్నారు.

దగ్గరలోనే వున్న కాంటీన్ కి తీసుకెళ్లి పాపకి పాలు ఇప్పించాడు. పాలు తాగేసి మళ్ళీ మామూలుగా ఏడుస్తోంది.

పాపవైపు పరీక్షగా చూసాడు, ముద్దుగా బొద్దుగా ముట్టుకుంటే కందేటట్టు వుంది. ఇంతలో ఒక్కొక్కరు పలకరించడం మొదలు పెట్టారు.

...ఏమైంది ఎందుకలా ఏడుస్తోంది పాప".

క్షణం తటాపటాయించి "ఏం లేదు" ముభావంగా చెప్పి అప్పుడే వచ్చి ఆగిన ట్రైన్ వైపు నడువ సాగాడు.

పాపమరీ బిగ్గరగా ఏడవటంతో పాపని ఎత్తుకుంటూ, "అమ్మదగ్గరికి వెళ్తున్నాం పాపా" అన్నాడు.

ఆ మాట వినగానే పాప ఏడుపు ఆపేసింది.

***

రాధిక పాపకి అన్ని విధాలుగా దగ్గరయింది, రాధికను విడచి క్షణం వుండదు పాప. రకరకాల ఆట బొమ్మలతో పాపకి దగ్గరయేందుకు ప్రయత్నించేవాడు రాజారావు.

సినిమాలకి షికార్లకి వెళ్ళేటప్పుడు ముచ్చటగా ముద్దుగా తయారుచేసి మురిపెంగా తీసుకెళ్ళేవారు, ఆ పాపని చూసి ఇద్దరి హృదయాలు స్పందించేవి. పాపకి కాస్త నలతగా వుంటే ఆఫీస్ మానేసి హాస్పటల్ కి పరుగు తీయాల్సిందే. లేకుంటే రాధిక సతాయింపు భరించలేక పోయేవాడు.

రాధిక కొంగుపట్టుకుని తిరుగుతుంటే పాపని చూసి రాజారావు మనసు గంతులేసేది. ఆ పాప వలనే తమ ఇంటికి కళవచ్చిందని మురిసిపోయేవారు.

ఆఫీసు నుండి ఇంటికొచ్చేటపుడు పాపగురించి ప్రత్యేకంగా ప్రతీరోజూ ఏదో ఒకటి తెస్తూనే వుంటాడు. రకరకాల డ్రెస్ లతో రోజూ అలంకరించి మురిసిపోవడం దినచర్యగా అయిపోయింది.

పాపని కాన్వెంట్ లో చేర్పించేందుకు రాధిక రాజారావు సంప్రతించుకుంటున్నారు.

"పాపని అంతదూరం స్కూల్ లో వేయిస్తే ఎలాగండి మనకి దగ్గరలోనే చూడండి నేనే తీసుకెళ్ళి తీసుకొస్తుంటాను"

కాన్వెంట్ కి ఇల్లు దూరం కావడంతో ఎలాగో కష్టపడి కాన్వెంట్ దగ్గరలో ఇల్లు తీసుకున్నారు.

పాపకి కాంతిమయి అనిపేరు పెట్టుకున్నారు.

కాన్వెంట్ దగ్గరే అయినా ప్రతిరోజూ కాంతిమయిని తీసుకెళ్ళి తీసుకొస్తుండేది రాధిక. తనచేతితో గోరుముద్దలు తినిపించుతుంటే కాంతిమయి మారాం చెయ్యకుండా తినడం ఎంతో ఆనందాన్ని కలిగించేది రాధికకు.

***


కాంతిమయికి స్నానం చేయించి డ్రెస్ వేస్తుండగా తలుపు తట్టిన చప్పుడుకి "వస్తున్నా" అంటూ పరుగు లాంటి నడకతో వెళ్ళి తలుపు తెరచింది.

ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి వణికిపోయింది.

"ఎవరుకావాలి" అని అన్నానని అనుకుంది కాని గొంతుదాటిరాలేదు.

"ఆర్. రాజారావు వుండేది ఈ ఇంట్లోనేనా?" పోలీసు ఇన్ స్పెక్టర్ గొంతు కరుకుగా వుంది.

"అవును ఏం జరిగింది" భయంగా అడిగింది.




"అతన్ని అరెస్టు చేశాము. మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు ఎస్.ఐ. గారు" రాధిక ప్రాణంలేని దానిలా కాంతిమయిని తీసుకుని వారివెంట నడిచింది. పోలీస్‌స్టేషన్ గందరగోళంగా వుంది, రాధికను ఎస్.ఐ. గారు ప్రశ్నించారు.

"మీకెంతమంది పిల్లలు".

రాధిక కంగారుగా భర్తవైపు చూసింది, రాజారావు తలదించుకుని వుండటంతో కొద్దిగా అర్థమైంది పరిస్థితి.

"మాకు పిల్లలులేరు" అంది తలదించుకుని.

"ఆ పాప ఎవరు" రాధిక చేయి పట్టుకుని నిలబడిన కాంతిమయిని చూపిస్తూ అడిగారు.

"పెంచుకున్నాము".

"ఎలా పెంచుకున్నారు. ఎవరి దగ్గరైనా దత్తత తీసుకున్నారా, డబ్బిచ్చి కొనుక్కున్నారా!"

"నాకు తెలీదు మావారు తీసుకొచ్చారు".

"ఎక్కడి నుండి తీసుకొచ్చారు".

"హైదరాబాద్ నుండి".

"ఆవూరు ఎందుకెళ్ళారు".

"ఆఫీసు పనిమీద".

"పిల్లలు లేకపోతే పిల్లల్ని పెంచుకునే పద్ధతి ఇది కాదమ్మా, దిక్కులేక అనాథశరణాలయములో పెరుగుతున్న పసివాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళలో ఎవరినైనా పెంపకానికి తీసుకుని గౌరవంగా పెంచుకోవచ్చు, అలాగ ఆ బిడ్డకి తల్లిగా మీరెంతో వుదారత గలవారౌతారు, కాని తల్లినుండి బిడ్డని వేరుచేసినట్లు తల్లి గురించి బిడ్డ బెంబేలెత్తి "అమ్మకావాలి" అని ఏడుస్తుంటే అసలు తల్లిని మరపించి ఆస్థానంలోకి మీరు వెళ్ళాలనుకోవడం అవివేకం. దారితప్పిన పసివాళ్ళని మనస్వార్థంకొరకు బలి చేయకుండా వాళ్ళ తల్లితండ్రుల దగ్గరికి పంపే ఏర్పాట్లు పోలీసు స్టేషన్‌కి వచ్చి రిపోర్టు ఇస్తే వాళ్ళే చేస్తారు, ముందుగానే మా పోలీసు డిపార్టుమెంట్‌కి రిపోర్టు ఇచ్చిన ఆ పాప తల్లి తండ్రులు ప్రక్కరూమ్‌లో ఉన్నారు, హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయిన వారి పాపని రాజారావు అనే ఈ వ్యక్తి దొంగతనంగా ఎత్తుకొచ్చినట్లు అక్కడి ప్రయాణీకులు ఇతని పోలికలు చెప్పారు".

అవమానంతో తలఎత్తలేక కూరుకుపోతున్న కాళ్ళను బలవంతంగా పైకి లేపదీస్తూ కాంతిమయిని తీసుకుని ప్రక్కగదిలోకి వెళ్ళి వాళ్ళ ముఖాలు చూడలేక. తలదించుకుని "క్షమించండి పొరపాటయింది" అని కాంతిమయిని వారి మధ్య వదిలి వెనుతిరగబోతుండగా, "మీరే మమ్మల్ని క్షమించండి ఈ పాప మా పాపకాదు" ఇద్దరు ఏక కంఠంతో అనేసరికి గర్వంగా విజయం సాధించిన తీరుతో లోపలికొస్తున్న ఎస్.ఐ. గారి తల అవమానంతో వాలిపోయింది. (ఇకనేమి చెప్పనవసరం లేదు)

తెలుగులో భారత రాజ్యాంగ శాసనము




DEVI PRASAD

వెల రూ.26-50

మనకోసం మనమే తయారుచేసుకున్న రాజ్యాంగ శాసనము యొక్క గొప్పదనమును, మన హక్కులు, బాధ్యతలు, అందరూ తేలికగా తెలుసుకొనుటకు ఉపకరించే ఒకే ఒక తెలుగు అనువాదము. చదువుకున్నవారు, చదువు లేనివారు, న్యాయవాది, రాజకీయవాది అనే భేదము లేకుండా, అన్ని సందర్భాలలో, అందరికీ ఉపయోగపడే పుస్తకం ఇది!

రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి సభ్యులు, వీరి ఎన్నికలు వీటన్నింటికి ఏర్పరచబడివున్న విధులను తెలియపరుస్తూ, భారత స్వాతంత్ర్య ఫలమును ప్రజలందరూ సమానంగా అనుభవించేందుకు నిర్దేశించబడిన రాజ్యాంగ శాసనానికి తేట తెనుగు అనువాదం!

పార్లమెంట్, శాసన సభల సభ్యులతోబాటు ప్రజలందరి వద్ద తప్పక ఉండవలసిన ఒడంబడిక చట్టము.

పోస్టు ద్వారా పొందదలనుకుంటే రూ.3-50 అదనంగా చేర్చి పంపండి.

'బాలాజీ' వారి ప్రచురణ......
భారతీయ శిక్షా చట్టము
వెల: రూ.15-75

BALAJI PUBLICATIONS
103, PYCROFTS ROAD MADRAS-600 014